సింగరేణి హెడ్డాఫీస్‌ను సందర్శించిన పీవీ వావా

మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ మెంబర్ వావా

కొత్తగూడెం సింగరేణి, జూలై 1 : భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సామాజిక మంత్రిత్వశాఖ, జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా సోమవారం సింగరేణి హెడ్డాఫీస్‌ను సందర్శించారు. సింగరేణి డైరెక్టర్(పా) శ్రీనివాస్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ వ్యాప్తంగా పనిచేసే సఫాయి కర్మచారి కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి సంస్థ తీసుకునే చర్యలపై సంబంధిత అధికారులతో పీవీ వావా సమీక్షించారు. కార్మికులకు అందించే జీతభత్యాలు, సదుపాయాలు, శ్రేయస్సుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం సింగరేణి సంస్థ అందించే సదుపాయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అఖిలభారత సఫాయి సంఘం జాతీయ కార్యదర్శి భూపతి అప్పారావు కార్మికుల సమస్యలపై పీవీ వావా, సంస్థ డైరెక్టర్(పా) ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జీఎం దీక్షితులు, సురేశ్‌బాబు, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, సీఎంవో డాక్టర్ సుజాత, డీజీఎం రాజశేఖర్, డీజీఎంలు వైవీఎల్ వరప్రసాద్, రాజగోపాల్ పాల్గొన్నారు.

బదిలీ స్థానాల్లో రిపోర్ట్ చేస్తున్న ఎస్‌జీటీలు

నిబంధనలతో తికమకపడుతున్న టీచర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 1 : విద్యాశాఖ నిర్వహించిన ఎస్‌జీటీల బదిలీలు టీచర్లను తికమకకు గురిచేస్తున్నాయి. నిబంధనలు చూసిన టీచర్లు అసలు తమకు బదిలీ జరిగిందా..? జరగలేదా అనే గందరగోళంలో ఉన్నారు. సోమవారం విడుదల చేసిన సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జీటీ), పండిట్ల బదిలీలపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 0 నుంచి 19లోపు మంది విద్యార్థులు ఉంటే ఒక టీచరు, 60 లోపు విద్యార్థులుంటే ఇద్దరు, 90 లోపు విద్యార్థులుంటే ముగ్గురు టీచర్లను పాఠశాలలకు కేటాయిస్తున్నారు. ఈ మూడు కేటగిరిల్లో టీచర్లు బదిలీ అయినప్పటికీ రిలీవ్ చేయని పరిస్థితి కనిపిస్తున్నది. ఇతర ఉపాధ్యాయులు ఎవరైనా ఈ పాఠశాలలను కోరుకుంటే తప్ప వారిని రిలీవ్ చేయవద్దని డీఈవో నుంచి ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు ఆదేశాలు అందడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారు.

1,061 మందికి ట్రాన్స్‌ఫర్..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు, పండిట్‌లకు సంబంధించి 1,061 మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ సోమవారం విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. వీటికి డీఈవో సోమశేఖరశర్మ సపోర్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. 1,016 మంది ఎస్‌జీటీలు కాగా, 45మంది పండిట్ ఉపాధ్యాయులు బదిలీల్లో ఉన్నారు. వీరు సోమవారం ఉదయం రిలీవ్ అయి బదిలీ పొందిన స్థానాల్లో రిపోర్ట్ చేశారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 1 : జిల్లాలోని ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు-2024 కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సోమశేఖర శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను ఈ నెల 15వ తేదీలోగా నేషనల్ అవార్డ్స్ టీచర్స్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, రెండు కాపీలను ఎంఈవో ధ్రువీకరణతో డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

> "ఇంతమట్టికీ నేను ఎవరి జోలికి పోలేదు.. రైతుగానే బతికిన.. రైతురాజ్యం వస్తే బాగుంటదని చెప్పి కాంగ్రెస్ గవర్నమెంట్‌కి ఓటేశాను.. కాంగ్రెస్ గవర్నమెంట్‌కు ఓటేసినందుకు ఇదేనా నాకు న్యాయం.. నాకు చావు తప్ప వేరే గత్యంతరం లేదు.. నేను చనిపోయిక నా కుటుంబ సభ్యులకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.."
>
> – ఇవి రైతు పలికిన ఆఖరిమాటల్లో కొన్ని

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

- చనిపోయే ముందు వీడియో తీసుకున్న వైనం
- తన పొలాన్ని కొందరు నాశనం చేశారంటూ ఆవేదన
- అధికారులకు చెప్పకున్నా న్యాయం జరగలేదని విలపించిన అన్నదాత
- రైతురాజ్యం కోసం కాంగ్రెస్ గవర్నమెంట్‌కు ఓటేశానని కన్నీరుమున్నీరు
- తాను చనిపోయాక కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు
- సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి వీడియోను చేరవేయాలన్న బాధితుడు

బోజడ్ల ప్రభాకర్ (ఫైల్)

మధిర, జూలై 1 : పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్(43) తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ తన సెల్‌ఫోన్‌లో ఓ వీడియో చిత్రీకరించి అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ వీడియోలో పురుగుల మందు డబ్బా పట్టుకొని తన బాధను ఈ విధంగా చెప్పుకొచ్చాడు.. చింతకాని మండలం ప్రొద్దుటూరు రెవెన్యూ సర్వే నంబర్ 276, 277లో గల బోజడ్ల ప్రభాకర్, బోజడ్ల వీరభద్రయ్యకు చెందిన భూమిలో సమీప చెరువు నుంచి మరం తోలించారు. అదే గ్రామానికి చెందిన కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావు, గుర్రం నాగమల్లేశ్వరరావు, మొగిలి శ్రీను, మొగిలి ముత్తయ్య తదితరుల ప్రోద్బలంతో కొందరు వ్యక్తులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ తన పొలంలోని మట్టిని జేసీబీలు, ప్రొక్లెయిన్లతో చెల్లాచెదురు చేసి నాశనం చేశారని ప్రభాకర్ విలపించాడు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన ఆవేదనను అర్థం చేసుకోవాల్సిందిగా వీడియోలో వేడుకున్నాడు. ఈ విషయంపై చింతకాని తహసీల్దార్ రమేశ్, చింతకాని ఎస్సై షేక్ నాగుల్‌మీరాకు పలుమార్లు విన్నవించుకున్నా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిందని బోరున విలపించాడు. కలెక్టర్‌కు విన్నవించుకుందామని సోమవారం కలెక్టరేట్‌కు వస్తే సమయం అయిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పారని దీంతో దిక్కుతోచని స్థితిలో పురుగుల మందు తీసుకున్నానని వీడియోలో ఏడుస్తూ తెలిపాడు. ఆ వీడియోను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చేరవేయాలని కోరుకున్నాడు. తనకున్న 7ఎకరాల 10గుంటల భూమిలో 3ఎకరాలను పూర్తిగా సర్వనాశనం చేశారని వాపోయాడు. రైతురాజ్యం వస్తుందని తాను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశానని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇదేనా నాకు చేసిన న్యాయం అని బోరున విలపించాడు. నేను ఇప్పటివరకు నీతిగా వ్యవసాయం చేసుకుంటూ ఒకరిజోలికి పోకుండా బతుకుతున్నానని, తాను చనిపోయాక తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ పురుగుమందు డబ్బా పట్టుకొని రెండు చేతులు జోడించి కన్నీళ్ళు పెడుతూ ప్రాధేయపడ్డాడు. అందరూ కలిసి రైతునైనా తనకు న్యాయం చేయాలని వీడియోలో వేడుకున్నాడు. అనంతరం ప్రభాకర్ ఖమ్మం సమీపంలోని ఓ మామిడితోట దగ్గరలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన ప్రభాకర్ సాయంత్రమైనా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు అతడి ఫోన్‌కు పదేపదే ఫోన్ చేస్తున్నారు. ఈక్రమంలో అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు ఫోన్ ఎత్తి విగతజీవిగా పడి ఉన్న ప్రభాకర్ సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. వెంటనే కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రభాకర్‌ను ఆసుపత్రికి తరలించేలోపే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అధికారులు ఆరా తీస్తున్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆపరేషన్ 'ముస్కాన్'

ఐదు ప్రత్యేక బృందాల ఏర్పాటు : భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, జూలై 1 : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ 'ముస్కాన్-X' ప్రారంభమైందని జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆపరేషన్ ముస్కాన్-X ఈ నెల 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. జిల్లాలో ఉన్న వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో బాల కార్మికుల విముక్తి కోసం దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, బాలకార్మికులను గుర్తించి వారికి విముక్తి కలిగించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. బాల బాలికలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆపరేషన్ ముస్కాన్ బృందాల ద్వారా గుర్తించిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనాథ పిల్లలను సంరక్షణ గృహాలకు తరలిస్తామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైన బాల కార్మికులు కనపడితే వెంటనే డయల్ 100కి లేదా 1098కి ఫోన్‌చేసి పోలీస్‌శాఖకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వారిని సంరక్షించడమే ప్రధాన ధ్యేయమని తెలిపారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

చింతకాని, జూలై 1: పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని, బేస్‌లైన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ అన్నారు. మండల పరిధిలో మత్కేపల్లి నామవరం ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి బేస్‌లైన్ పరీక్షల నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. పది విద్యార్థులను కలిసి హిందీ, గణితం, భౌతికశాస్త్రం అంశాల్లో పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని తెలుసుకున్నారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని, కష్టమైన సబ్జెక్టునే ఇష్టంగా మలచుకోవాలని విద్యార్థులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంట సిబ్బందికి వేతనాలు పడేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరపనేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పరిశ్రమించారు

పూర్వ కలెక్టర్ వి.పి గౌతమ్ సన్మాన సభలో పలువురు వక్తలు

ఘనంగా సన్మానించిన జిల్లా అధికారులు, ఉద్యోగులు

పుష్పగుచ్ఛాలు, వేద మంత్రాలతో పూర్ణ కుంభ స్వాగతం

ప్రభుత్వ పథకాలు పేదలకు చేరాలన్నదే నా ఆశయం

సభలో సన్మాన గ్రహీత పూర్వ కలెక్టర్ వీ.పీ గౌతమ్

వీపీ గౌతమ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మామిళ్లగూడెం,జూలై1: జిల్లాలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా పరిశ్రమించారని పలువురు వక్తలు పునర్‌ఉద్ఘాటించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పూర్వ కలెక్టర్ వి.పి గౌతమ్ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ గౌతమ్ దంపతులను జడ్పీ ప్రధాన గేటు నుంచి వేద మంత్రాలు, పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర టీజీవోస్ అధ్యక్షులు, జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పని చేసిన మూడేళ్ల కాలంలో విద్య, వైద్యం, సంక్షేమ రంగాలను పరుగులు పెట్టించడంతో పాటు అభివృద్ధిని విజయవంతంగా ముందుకు సాగించారని కొనియాడారు. అనేక మంది విద్యార్థులు, అధికారులు, ప్రజలు కష్టాలలో ఉన్న సమయంలో వారికి అండగా నిలిచేందకు ఇరువై నాలుగు గంటలు తాను పని చేయడంతో పాటు అధికారులను సిబ్బందిని పనిలో నిమగ్నం చేశారని తెలిపారు. పాలన సాగిన మూడేళ్లలో జిల్లాలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఖమ్మం జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచడంలో కలెక్టర్‌గా చేసిన కృషి మరువలేనిదన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో కీలకంగా అమలు చేసిన దళిత బంధు, కళ్యాణలక్ష్మీ వంటి పథకాలతో మన ఊరు, మన బడి వంటి కార్యక్రమాలను ఎంతో సమర్థవంతంగా అమలు చేశారన్నారు. దళిత బంధులో లబ్ధిదారులకు యూనిట్లు కేటాయించడం మాత్రమే కాదు వారు దీని ద్వారా అభివృద్ధి చెందుతున్న తీరును పర్యవేక్షణ చేసి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. కరోనా వంటి మహమ్మారి వ్యాప్తి చెందుతున్న కాలంలో అనేక మంది పేదల ప్రాణాలను నిలపడంతో తన వంతు కర్తవ్యాలను నిర్విఘ్నంగా పూర్తి చేశారన్నారు. ఓ గురుకుల విద్యార్థిని భవనం పై నుంచి కిందపడి ప్రాణాపాయ స్థితిలో ఉంటే ఆ విద్యార్థిని ప్రాణాలను కాపాడటంతో నేడు ఆ విద్యార్థి తన ఇంటర్ విద్యను సైతం పూర్తి చేసి భవిష్యత్తుకు పునాదులు వేసుకుందని ఆశాఖ అధికారి సంఘటనను వివరించి కంట తడిపెట్టారు. అదేవిధంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజీ విభాగం హెచ్‌వోడీగా పని చేస్తున్న డాక్టర్‌ను కాపాడిన తీరును స్వయంగా డాక్టర్ కృపా ఉషశ్రీ వివరించి కన్నీరు పెట్టుకున్నారు. రెవెన్యూ శాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి ఎంతో మంది పేద రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించిన ఘనత కలెక్టర్‌గా గౌతమ్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయ శాఖలో ప్రధానంగా నకిలీ విత్తనాలను జిల్లాలో నియంత్రించడంలో చేసిన కృషి రైతులు మర్చిపోలేరన్నారు. జిల్లాలో ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలలో నూరు శాతం అవినీతిని అరికట్టిన ఘనత వీరికే ఉందన్నారు. ఇలా ప్రతి అంశంలోను సమస్య పరిష్కారానికి చాలా లోతుగా విశ్లేషించి మార్గం చూపారన్నారు. ఎన్నికలు, ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించడంలో తీసుకున్న శ్రద్ధ ప్రభుత్వ బడుల్లో నేడు ఉపాధ్యాయులు, విద్యార్థులు వాటిని ఎంతో ఆనందం వ్యక్తం చేయడంలో వీరి కృషి కనిపిస్తుందన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ఎన్నికల నిర్వహణకు సమన్వయంగా పని చేసి విజయవంతం చేశామన్నారు. అనంతరం సన్మాన గ్రహీత, జిల్లా పూర్వ కలెక్టర్ వి.పి గౌతమ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరాలన్నదే ఆశయంగా పని చేశాన్నారు. ప్రభుత్వ పెద్దలు అందించిన సహకారంతో జిల్లాలో నా శక్తి మేరకు అభివృద్ధి చేశానన్నారు. సంక్షేమ పథకాల అమలుకు జిల్లా అధికార యంత్రాంగం అందించిన సహకారంతోనే అన్ని అంశాలలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేందుకు సాధ్యమైందన్నారు. జిల్లాలో మూడేళ్లపాటు పని చేసే అవకాశం కల్పించిన ప్రభుత్వ పెద్దలకు, సహకారం అందించిన జిల్లా స్థాయి అధికారుల నుంచి ఉద్యోగుల వరకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ దంపతులను గజమాలతో అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌లో విక్రమ్ సింగ్ సిదార్థ, డీఆర్‌డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో వినోద్, డీఆర్‌వో రాజేశ్వరి, జిల్లా అధికారులు కొండపల్లి శ్రీరామ్, కస్తాల సత్యనారాయణ, విజయనిర్మల, డీఎంఎండ్‌హెచ్‌వో డాక్టర్ మాలతి, డీఈవో సోమశేఖర్‌శర్మ, సునీల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అరుణ, జ్యోతి, డీపీఆర్‌వో గౌస్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ రూ.249 ప్లాన్

45 రోజుల వ్యాలిడిటీ.. రోజూ 2జీబీ టెలికం ఇండస్ట్రీలో హాట్ టాపిక్

న్యూఢిల్లీ, జూలై 1: దేశీయ ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఓ నయా ప్లాన్‌ను పరిచయం చేసింది. దీని రేటు రూ.249 మాత్రమే. కాలవ్యవధి 45 రోజులు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో ఉన్న ఈ ఆకర్షణీయ ప్యాకేజీలో రోజూ 2జీబీ డాటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లను వినియోగదారులు వాడుకోవచ్చు. అయితే ప్రైవేట్ రంగ టెలికం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. ఇటీవలే తమ ప్లాన్ల ధరలను భారీగా పెంచుతున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్లాన్ ఇప్పుడు టెలికం ఇండస్ట్రీలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. అధిక టారీఫ్‌ల నుంచి ఉపశమనాన్ని కోరుకునే మొబైల్ యూజర్లను ఆకట్టుకునేందుకే బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరకే ఎక్కువ ప్రయోజనాలున్న ఈ ప్లాన్‌ను తీసుకొచ్చిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇతర టెలికం కంపెనీలు ఇదే ధర (రూ.249)కు రోజుకు 1జీబీ డాటానే ఇస్తుండగా, వ్యాలిడిటీ కూడా 28 రోజులే ఉంటుండటం గమనార్హం. దీంతో బీఎస్ఎన్ఎల్ నూతన ప్లాన్‌లో రోజువారీ డాటా రెట్టింపవడమేగాక, ప్లాన్ గడువు కూడా 17 రోజులు పెరుగుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ వినియోగదారులకు ఇది గొప్ప ఊరటగానే చెప్పుకోవచ్చు. ఇదిలా వుంటే బుధవారం నుంచి జియో, ఎయిర్‌టెల్.. గురువారం నుంచి వొడాఫోన్ ఐడియా తమ ప్లాన్ల ధరలను దాదాపు 26 శాతం మేర పెంచుతున్నాయి. దీంతో ఒక్కో వినియోగదారునిపై గరిష్ఠంగా రూ.600 భారం పడబోతున్నది.

బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి

ఉన్నత శిఖరాలకు సూచీలు

సెన్సెక్స్ 443, నిఫ్టీ 131 పాయింట్ల వృద్ధి

ముంబై, జూలై 1: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు ముఖ్యంగా ఆసియా, యూరోపియన్ సూచీలు లాభాల్లో మునిగియడంతో దేశీయ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 443.46 పాయింట్లు అందుకొని ఆల్-టైం హైకి 79,476.19 పాయింట్లకు చేరుకున్నది. 30 షేర్ల ఇండెక్స్‌లో 20 షేర్లు లాభపడగా, 10 షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 24 వేల పాయింట్ల పైన ముగిసింది. 131.35 పాయింట్లు అందుకొని 24,141.95 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.4,43,05,344.036 కోట్లకు చేరుకున్నది.

- టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌లుషేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- ఐటీ అత్యధికంగా 1.84 శాతం లాభపడగా.. టెక్ 1.46 శాతం, కమోడిటీస్ 1.21 శాతం, టెలికమ్యూనికేషన్ 1.03 శాతం, మెటల్ రంగ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

యంగ్‌వన్‌లో దుస్తుల తయారీ!

కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ వెల్లడి

గీసుగొండ, జూలై 1: వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో త్వరలో దుస్తుల తయారీని ప్రారంభించనున్నట్లు యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ తెలిపారు. ప్లాంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం 297 ఎకరాల భూమి కేటాయించినట్లు, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు మంజూరు చేసిందన్నారు. వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, తద్వారా 11 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ యూనిట్‌లో స్పోర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, జర్కిన్స్, సూట్స్ తదితర దుస్తులు తయారుకానున్నాయి. అలాగే శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌సీసీకి 335 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, జూలై 1: రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ ఆర్డర్లు ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. గడిచిన నెలలో రూ.335 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని తెలిపింది. వీటిలో అంతర్జాతీయ ఆర్డర్లు లేవని పేర్కొంది.

అంతర్జాతీయ పేమెంట్స్ కోసం..

వివిధ ఆసియా దేశాలతో కలిసి వెళ్తున్న ఆర్బీఐ

ముంబై, జూలై 1: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. మలేషియా, సింగపూర్ సహా నాలుగు ఆసియా దేశాలు కలిసి వేగవంతమైన రిటైల్ పేమెంట్స్ కోసం ఓ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. 2026లో ఇది అందుబాటులోకి రావచ్చన్న అంచనాలున్నాయి. దేశీయ ఫాస్ట్ పేమెంట్స్ సిస్టమ్స్ (ఎఫ్‌పీఎస్) ఇంటర్‌లింకింగ్ ద్వారా ఓ ఇన్‌స్టంట్ క్రాస్-బార్డర్ రిటైల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధికి బహుళజాతి ఆలోచన ప్రాజెక్ట్ అయిన నెక్స్‌స్‌లో భాగస్వామ్యమైనట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ (బీఐఎస్) ఇన్నోవేషన్ హబ్ కాన్సెప్ట్లే ఈ నెక్స్‌స్. దీని ద్వారా తొలుత భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్ దేశాల ఎఫ్‌పీఎస్‌ల అనుసంధానం జరుగుతుందని ఆర్బీఐ వివరించింది. ఈ మేరకు జరిగిన ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఆర్బీఐతోపాటు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు, బీఐఎస్ సంతకాలు చేశాయి. మున్ముందు మరిన్ని దేశాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతాయని ఆర్బీఐ చెప్పింది.

పూర్తిగా రాని రూ.2వేల నోట్లు

రూ.2వేల నోట్లు పూర్తిగా తిరిగి బ్యాంకుల్లోకి రాలేదని ఆర్బీఐ సోమవారం తెలిపింది. ఇప్పటిదాకా 97.87 శాతం వచ్చినట్టు వివరించింది. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని చెప్పింది. గత ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు వీటి విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్నది. అయితే జూన్ 28 నాటికి ఇది రూ.7,581 కోట్లకు పడిపోయినట్టు ఆర్బీఐ తెలిపింది. దీంతో 97.87 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకుల్లోకి వచ్చేశాయని పేర్కొన్నది. ఈ పెద్ద నోట్ల మార్పిడికి ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని 19 ఆర్బీఐ కార్యాలయాల్లో వీలు కల్పించారు. 2016 నవంబర్‌లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు నేపథ్యంలో ఈ రూ.2000 నోట్లు పరిచయమైన సంగతి విదితమే.

కొత్త ఈడీల నియామకం

ఎగ్జిక్యూటివ్ డై